# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :303 గురువారం 2-7-2026 పేజీలు:8 వెల:3

https://www.epaperjournalistdiary.com/









### రెండో విడత రైతు భరోసా

## నిధులు విడుదల

- 10.68 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1590.02 కోట్లు జమ
- మూడెకరాలు ఉన్న రైతులకు లబ్ధి

**హైదరాబాద్**

వానాకాలం రైతు భరోసా రెండో విడత నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. రెండు ఎకరాల నుంచి మూడెకరాల వరకు భూమి కలిగి ఉన్న 10.68 లక్షల రైతుల ఖాతాల్లో రాష్ట్ర సర్కారు రూ.1,590.02 కోట్లు జమ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో రూ.2,482 కోట్ల నిధులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండ్రోజుల వ్యవధిలో 32 జిల్లాలకు చెందిన 54,95,742 మంది రైతుల ఖాతాలో మొత్తంగా రూ.4072.04 కోట్లు జమ చేసినట్టు అయ్యింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాకు చెందిన 4,06,875 మంది

-మిగతా 2 లో

# చర్చకు సిద్ధమే..




### దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పు

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ప్రతిసవాల్
- ప్రభుత్వ వైఫల్యాలు నిరూపించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- అబద్ధాలు ఆపి ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు
- రాష్ట్రం దివాలా తీసింది సీఎం వల్లే
- రైతాంగానికి రూ.1.13 లక్షల కోట్లు ఎగ్గొట్టారు: కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ఏ అంశంపైనైనా ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిసవాల్ విసిరారు. వరంగల్, హైదరాబాద్‌లో అసెంబ్లీ, బోధి పెవిలియన్, ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ చౌరస్తా ఎక్కడికైనా తానే స్వయంగా వస్తానని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపైనా, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాలతో సహా నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల

-మిగతా 2 లో



### యాదగిరిగుట్టకు నూతన

## పాలకమండలి ఏర్పాటు

- చైర్మన్‌గా ఎంఎస్ఎన్ గ్రూప్ సీఎండీ మన్నె సత్యనారాయణ రెడ్డి నియామకం
- బోర్డు సభ్యురాలిగా చిరంజీవి అర్ధాంగి సురేఖ కొణిదెల
- టీటీడీ తరహాలో 18 మందితో కమిటీ..రెండేళ్ల పదవీకాలం

**హైదరాబాద్**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి (వైటీడీ) రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలక మండలిని ఏర్పాటు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో మొత్తం 18 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించింది. బోర్డు చైర్మన్‌గా ప్రముఖ ఔషధ రంగ పారిశ్రామికవేత్త, ఎంఎస్ఎన్ గ్రూప్ వ్యవస్థాపక సీఎండీ డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పాలక మండలిలో సభ్యులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, ప్రముఖ నటుడు చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖకు చోటు కల్పించారు. వారితో పాటు చిలపుగారి విజయరాజం, తూళ్ల విజయేందర్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతమణి, ఎం.రాఘవేంద్ర రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్

-మిగతా 2 లో



### ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో

## యూపీఐ అగ్రస్థానం

- 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు
- రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు
- 11 ఏళ్ల డిజిటల్ ఇండియాపై ప్రధాని ప్రశంసలు
- సాంకేతికతతో ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రధాని వ్యాఖ్య

దేశ డిజిటల్ విప్లవానికి ప్రతీకగా నిలిచిన డిజిటల్ ఇండియా కార్యక్రమం 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రస్తుతం దేశంలో 103 కోట్లకు పైగా ఇంటర్నెట్ కనెక్షన్లు, రోజుకు 66 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతికతను ప్రతి పౌరుడికి చేరువ చేస్తూ, డిజిటల్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ రంగాల్లో భారత్‌ను ప్రపంచానికి ఆదర్శంగా నిలిపిన డిజిటల్ ఇండియా దేశ అభివృద్ధికి కీలక శక్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు.



## శెభాష్..లోకేష్

- విద్యా శాఖ మంత్రిగా లోకేష్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు
- విద్యాశాఖలో సంస్కరణలు కొనసాగించాలని సూచన
- యువతలో స్ఫూర్తి నింపేలా లోకేష్ ప్రసంగించారని అభినందించిన రాష్ట్రపతి

**అమరావతి**

విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేస్తున్న నారా లోకేష్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. ఈ సంస్కరణలు కొనసాగాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్శిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేష్ వెళ్లారు. తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్కరణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినందించారు. వీటిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థ మార్పులు వారికి బంగారు భవిష్యత్తుకు మార్గం

-మిగతా 2 లో

## ఆదాయం

# పెంచండి

### ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలి

- ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో లీకులు లేకుండా చూడండి
- ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలో అప్ చేయాలి
- భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలి
- ఊహాజనిత బడ్జెట్ కాదు... వాస్తవికత ఆధారగానే బడ్జెట్‌ను రూపొందించాలి
- ఆదాయ సమీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**తెలంగాణ బ్యూరో ప్రతినిధి**

రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయం పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదాయ పెంపుదల, నిధుల సమీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన క్యాంపు ఆఫీసులో ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు.

-మిగతా 2 లో





### రాగల 4 రోజులు భారీ

## వర్ష సూచన!

- రాష్ట్రంలోని అన్నదాతలకు ఊరట
- గంటకు 50 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం
- తెలంగాణ వాతావరణ శాఖ

**హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా రాగల నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గాలివేగం గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. దక్షిణ మధ్య మధ్యప్రదేశ్ నుండి తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు సముద్ర మట్టానికి 4.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రస్తుతం బలహీనపడిన కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల,

-మిగతా 2 లో



2 లో

### భారత్-పాక్ సంబంధాలు

## పునరుద్ధరించండి..

- మోదీ, షెహబాజ్ షరీఫ్‌కు 117 మంది ప్రముఖుల బహిరంగ లేఖ
- భారత్--పాక్ సంబంధాల పునరుద్ధరణకు విజ్ఞప్తి
- వీసాలు, విమానాలు, వాణిజ్య సేవలు పునఃప్రారంభించాలని సూచన
- అట్టారి--వాఘా సరిహద్దు తెరవాలని ప్రతిపాదన
- వైరం వల్ల యువత, ఆర్థిక వ్యవస్థకు నష్టమని ఆందోళన


## అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధం



- విఫలమైతే యుద్ధానికీ వెనుకాడబోమన్న హెచ్చరిక
- అణు హక్కుల విషయంలో రాజీ లేదన్న తెహ్రాన్
- దోహాలో కీలక మధ్యవర్తిత్వ చర్చలు
- ఆంక్షల ఎత్తివేత, ఒప్పందంపైనే ఇరాన్ పట్టుదల
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

2

## పాకిస్థాన్‌పై తాలిబన్ ప్రతీకార దాడులు..



- డ్రోన్లతో విరుచుకుపడ్డ ఆఫ్ఘన్ సైన్యం
- ఐఎస్-కే స్థావరాలే లక్ష్యమన్న తాలిబన్
- సరిహద్దులో ఉద్రిక్తతలు మరింత తీవ్రం
- పాక్ వైమానిక దాడులకు ప్రతీకార చర్యలు
- పౌరుల మృతులపై పరస్పర ఆరోపణలు

2

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## శెభాష్..లోకేష్

మొదటి తరువాయి



వేస్తాయన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగం స్ఫూర్తివంతంగా సాగిందని రాష్ట్రపతి అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని ప్రశంసించారు.

## రాగల 4 రోజులు భారీ వర్ష సూచన!

మొదటి తరువాయి

నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఈ నెల 4న బలమైన ఉపరితల గాలులు ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల్లో వీచే అవకాశం ఉందని తెలిపింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగుండంలో అత్యధికంగా 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 5 సెం.మీ., మెదక్ జిల్లా చేగుంటలో 5 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 5 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్‌లో 4 సెం.మీ., జగిత్యాల జిల్లా పెగడపల్లిలో 4 సెం.మీ., మల్యాలలో 4 సెం.మీ., జైపూర్‌లో 4 సెం.మీ., మంచిర్యాల జిల్లా జన్నారంలో 3 సెం.మీ., పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 3 సెం.మీ., కునారంలో 3 సెం.మీ., మంథనిలో 3 సెం.మీ., నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 3 సెం.మీ., మంచిర్యాల జిల్లా కోటపల్లిలో 3 సెం.మీ., రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తిలో 3 సెం.మీ., నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో 3 సెం.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 3 సెం.మీ., చంద్రుగొండలో 3 సెం.మీ., కరీంనగర్ జిల్లా గంగాధరలో 3 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా దిలావర్పూర్‌లో 3 సెం.మీ., సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 3 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా తంసీలో 3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

## పాకిస్థాన్‌పై తాలిబన్ ప్రతీకార దాడులు..

-డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఆఫ్ఘన్ సైన్యం
-ఐఎస్-కే స్థావరాలే లక్ష్యమన్న తాలిబన్
-సరిహద్దులో ఉద్రిక్తతలు మరింత తీవ్రం
-పాక్ వైమానిక దాడులకు ప్రతీకార చర్యలు
-పౌరుల మృతులపై పరస్పర ఆరోపణలు



న్యూఢిల్లీ

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థాన్ భూభాగంపై ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ దళాలు డ్రోన్లతో దాడులు చేశాయి. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇవి ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ (ఐసిస్–కే) ఉగ్రవాద సంస్థ స్థావరాలని, వాటిని ధ్వంసం చేసేందుకే దాడులు చేశామని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది.పాకిస్థాన్‌పై దాడులను తాలిబన్లు సమర్థించుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పౌరులపై దాడులు, విద్రోహ చర్యలకు ఈ స్థావరాల నుంచి ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన 'టోలోన్యూస్' కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఓ పాఠశాలను ఐసిస్ ఉగ్రవాదులు రహస్య స్థావరంగా వాడుకుంటున్నారని, అందుకే దానిపై దాడి చేశామని తాలిబన్లు పేర్కొన్నారు. ఈ వైమానిక దాడుల్లో పలువురు ఐసిస్ సభ్యులు హతమయ్యారని, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని ఆఫ్ఘన్ ప్రభుత్వం స్పష్టంచేసింది. రెండు రోజుల క్రితం ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ భీకర వైమానిక దాడులు జరిపింది. ఈ దాడులకు ప్రతీకారంగానే తాలిబన్లు తాజా దాడులకు దిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ జరిపిన దాడుల్లో భారీగా పౌరులు మరణించారని ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆరోపించింది. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ దాడుల్లో 28 మంది పౌరులు మరణించగా, 49 మంది గాయపడ్డారు. అయితే తాము జరిపిన వైమానిక, భూతల ఆపరేషన్లలో 29 మంది ఉగ్రవాదులను హతమార్చామని పాకిస్థాన్ భద్రతాదళాలు ప్రకటించాయి. మరోవైపు ఆఫ్ఘన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ మాట్లాడుతూ.. పాక్ దాడుల్లో 38 మంది పౌరులు చనిపోయారని, వీరిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారని తెలిపారు. ఇదిలావుంటే.. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ సోమవారం తీవ్రంగా ఖండించింది. ఇది ఆఫ్ఘన్ సార్వభౌమత్వంపై జరిగిన దాడి అని, ప్రాంతీయ శాంతికి ప్రత్యక్ష ముప్పు అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. పాకిస్థాన్ తన అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, బాధ్యతల నుంచి దృష్టి మరల్చడానికి సరిహద్దుల ఆవల ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడటం ఆందోళనకరమని భారత్ విమర్శించింది. కాగా, కొంతకాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయి. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా.. ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండిస్తున్నారు.

### రెండో విడత రైతు భరోసా
## నిధులు విడుదల

మొదటి తరువాయి

రైతులు రూ.314.91 కోట్లను లబ్ది పొందారు. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో(హైదరాబాద్ జిల్లాను మినహాయించగా) 20,971 మంది రైతుల ఖాతాలో రూ.11.20 కోట్లు జమయ్యాయి.

## యాదగిరిగుట్టకు నూతన పాలకమండలి ఏర్పాటు

మొదటి తరువాయి

ఆలయ ఫౌండర్ ట్రస్టీలు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, యాదాద్రి జిల్లా కలెక్టర్, వైటీడీఏ వైస్ చైర్మన్, ఆలయ ఈవో ఎక్స్–అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎక్స్–అఫీషియో, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు మినహా మిగిలిన వారి పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. ఈ మేరకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణ రెడ్డికి ఉస్మానియా, పాలమూరు విశ్వవిద్యాలయాల నుంచి రెండు పీహెచ్‌డీలు ఉన్నాయి. ఈయన గతంలో మహబూబ్‌నగర్ ఎంపీగా పనిచేసిన మన్నె శ్రీనివాసరెడ్డికి సోదరుడు.

# ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ అగ్రస్థానం

- 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు
- రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు
-11 ఏళ్ల డిజిటల్ ఇండియాపై ప్రధాని ప్రశంసలు
- సాంకేతికతతో ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రధాని వ్యాఖ్య




న్యూఢిల్లీ

దేశంలో డిజిటల్ ఇండియా కార్యక్రమం ప్రారంభమై బుధవారంతో 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికతను వంద కోట్లకుపైగా భారతీయులు స్వీకరించడంతో దేశంలో విప్లవాత్మక మార్పులు జరిగాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా ప్రపంచ వేదికపై భారతదేశానికి కొత్త గుర్తింపును తీసుకువచ్చిందని, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి ఇది బలమైన పునాదిగా నిలిచిందని అన్నారు. 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లతో పాటు రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఒక వీడియోను షేర్ చేశారు. '11 ఏళ్ల డిజిటల్ ఇండియా విజయం ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి ఒక కొత్త గుర్తింపును ఇచ్చింది. ఆవిష్కరణలు, సాంకేతికతను స్వీకరించాలన్న దేశ ప్రజల సంకల్పాన్ని ఇది వెల్లడిస్తుంది. గత 11 ఏళ్లలో డిజిటల్ ఇండియా పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడంతో పాటు సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేసింది. ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ నుంచి డిజిటల్ లావాదేవీల వరకు ఈ కార్యక్రమం సాధించిన విజయాలు ప్రపంచ దేశాల దృష్టిని భారత్ వైపు మళ్లించాయి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**2015లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా**

ప్రధాని నరేంద్ర మోదీ 2015 జూలై 1న డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ప్రభుత్వ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతికతను ప్రతి పౌరుడికి చేరవేయడం దీని ప్రధాన లక్ష్యాలు. బ్రాడ్ బ్యాండ్ హైవేలు, మొబైల్ కనెక్టివిటీ, పబ్లిక్ ఇంటర్నెట్ సెంటర్లు, ఈ గవర్నెన్స్, ఆన్లైన్ సేవలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఐటీ ఉద్యోగాలు వంటి తొమ్మిది ప్రధాన స్తంభాల ఆధారంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

**యూపీఐతో ఆర్థిక విప్లవం**

భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలంగా మారిన యూపీఐ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. రోజుకు సగటున 66 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతుండటం ద్వారా భారత్ డిజిటల్ పేమెంట్స్ రంగంలో ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 49 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం జీడీపీలో 12 నుండి 14 శాతం వరకు వాటా కలిగి ఉండగా, వచ్చే దశాబ్దంలో ఇది 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

## ఆదాయం పెంచండి

మొదటి తరువాయి

అనంతరం మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజు, మైనింగ్‌ల్లో లీకులు లేకుండా చూడాలని సూచించారు. ఆదాయ సమీకరణ కోసం ఛేజింగ్ సెల్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐతో లబ్దిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా బడ్జెట్టును తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు మొదటి ప్రాధాన్యత తీసుకోవాలన్నారు. బడ్జెట్ ఊహాజనితంగా కాకుండా వాస్తవికతంగా రూపొందించుకోవాలన్నారు. వివిధశాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఆదాయ పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని ఆదేశించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్



వంటి కీలక శాఖలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆదాయ పెంపు ప్రక్రియను రోజువారీ పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'ఛేజింగ్ సెల్' ఏర్పాటు చేసి, నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల పారదర్శకత కోసం సరికొత్త సాంకేతికతను వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ టెక్నాలజీ)ని ఉపయోగించుకుని లబ్దిదారుల జాబితాను ఖరారు చేయాలని, దానిని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కి అనుసంధానం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇకపై కేవలం అంకెలకే పరిమితమయ్యే ఊహాజనిత బడ్జెట్ కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవికత ఆధారగానే కొత్త బడ్జెట్‌ను రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉండాలని, అందుకోసం భూసేకరణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించాలంటే శాఖ వారీగా అధికారులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

# అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధం

-విఫలమైతే యుద్ధానికీ వెనుకాడబోమన్న హెచ్చరిక
-అణు హక్కుల విషయంలో రాజీ లేదన్న తేహ్రాన్
-దోహాలో కీలక మధ్యవర్తిత్వ చర్చలు
-ఆంక్షల ఎత్తివేత, ఒప్పందంపైనే ఇరాన్ పట్టుదల
-అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్




న్యూఢిల్లీ

ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికా తో కీలకమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. తాము దౌత్యపరమైన శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈ చర్చలు విఫలమై ఇచ్చిన మాట తప్పితే మాత్రం యుద్ధానికి కూడా సిద్ధమేనని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రధాన ప్రతినిధి మహమ్మద్ బాగెర్ గాలిబాఫ్ స్పష్టంచేశారు. శుద్ధిచేసిన యురేనియంతో కూడిన తమ దేశ అణు హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అది ఇరాన్ విధించుకున్న 'రెడ్ లైన్' అని ఆయన తేల్చిచెప్పారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని కొన్ని కీలక నిబంధనలను పూర్తిగా అమలుచేసే వరకు తాము తదుపరి దశకు వెళ్లబోమని ఇరాన్ స్పష్టంచేసింది. ముఖ్యంగా లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించి దాని సార్వభౌమత్వాన్ని కాపాడటం, ఇరాన్ చమురు ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకల భద్రత వంటి అంశాలపై పట్టుబట్టింది. గతంలో 2015 నాటి అణు ఒప్పందం విషయంలో అమెరికా ఇచ్చిన హామీలను ఉల్లంఘించిన తీరును గాలిబాఫ్ ఈ సందర్భంగా విమర్శించారు. లెబనాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ కోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రయత్నిస్తున్నారని, ఇది ప్రస్తుత అవగాహన ఒప్పందానికి విరుద్ధమని ఆరోపించారు. అమెరికా విధించిన ఆంక్షలు (బ్లాకేడ్) తొలగిపోయిన తర్వాత తమ దేశ చమురు ఎగుమతులు పెరిగాయని, ప్రస్తుతం 40 మిలియన్ బారెళ్లకు పైగా చమురును ఎగుమతి చేస్తున్నట్లు గాలిబాఫ్ వెల్లడించారు. ఖతార్ విదేశాంగ మంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మధ్యవర్తిత్వ చర్చలలో అమెరికా అధికారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు కూడా పాల్గొంటున్నారు. అవగాహన ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతోనే ఈ దోహా చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇరాన్ ఒకవైపు చర్చలకు వస్తూనే.. మరోవైపు సైనికపరంగా యుద్ధానికి సై అనడం అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

## భారత్-పాక్ సంబంధాలు పునరుద్ధరించండి..

-మోదీ, షెహబాజ్ షరీఫ్‌కు 117 మంది ప్రముఖుల బహిరంగ లేఖ
-భారత్--పాక్ సంబంధాల పునరుద్ధరణకు విజ్ఞప్తి
-వీసాలు, విమానాలు, వాణిజ్య సేవలు పునఃప్రారంభించాలని సూచన
-అట్టారి--వాఘా సరిహద్దు తెరవాలని ప్రతిపాదన
-వైరం వల్ల యువత, ఆర్థిక వ్యవస్థకు నష్టమని ఆందోళన



న్యూఢిల్లీ

ఇటీవలి కాలంలో ఇండియా, పాక్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. గతంలోనే అంతంతమాత్రంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు గత ఏడాది పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌ల తర్వాత పూర్తిగా దెబ్బతిన్నాయి. చివరకు పాకిస్తాన్‌కు నీళ్లు కూడా ఇవ్వకూడదని భారత్ నిర్ణయం తీసుకుంది. ఏడాదిపైగా ఇరు దేశాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనేలా చూడాలని, చర్చలు జరపాలని, గతంలోలాగా ద్వైపాక్షిక సంబంధాలు పునరుద్ధరించాలని కోరుతూ.. ఇండియా, పాకిస్తాన్‌లకు చెందిన 117 మంది ప్రముఖులు భారత ప్రధాని నరేంద్ర మోదీకి, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు.ఇందులో ఇండియా నుంచి 61 మంది, పాకిస్తాన్ నుంచి 56 మంది ప్రముఖులు ఉన్నారు. ఇరు దేశాలు దీర్ఘకాలంగా కొనసాగుతున్న తమ శతృత్వాన్ని పక్కనబెట్టాలని లేఖలో కోరారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన వల్ల రెండు దేశాలకు చెందిన లక్షలాది మంది యువత ఇబ్బంది పడుతున్నారని, అనేక అవకాశాలు కోల్పోతున్నారని, ఆర్థికపరంగా నష్టం కలుగుతోందని లేఖలో వివరించారు. విశ్వాసం పెంపొందించేందుకు ఇరు దేశాల నేతలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సేవలు తిరిగి పునరుద్ధరించాలని, సాధారణ వీసా సేవలు, విమానయాన సేవలు ప్రారంభించాలని కోరారు. రెండు దేశాల సరిహద్దు అయిన అట్టారి–వాఘా మార్గాన్ని తెరవాలని, వ్యాపారం, వాణిజ్యం, పర్యటనలకు అవకాశం కల్పించాలని లేఖలో ప్రస్తావించారు. ఈ లేఖ రాసిన వారిలో ఇండియా నుంచి నేషనల్ కాంగ్రెస్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, వేర్పాటువాద నాయకుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ మాజీ మంత్రి హుమాయున్ కబిర్ వంటి ప్రముఖులు ఉన్నారు. పాకిస్తాన్ నుంచి మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షిద్ మహమూద్ కసూరి, మాజీ దౌత్యవేత్త అష్రాఫ్ జెహంగిర్ ఖ్వాజీ, అణుశాస్త్రవేత్త పర్వేజ్ వంటి వారు ఉన్నారు. అయితే, పాకిస్తాన్‌తో ఎలాంటి దౌత్యపరమైన, వాణిజ్యపరమైన సంబంధాలు లేవని గతంలోనే ఇండియా తేల్చి చెప్పింది. దీనిలో భాగంగా సింధు నది జలాల ఒప్పందాన్ని కూడా ఇండియా రద్దు చేసింది.

## చర్చకు సిద్ధమే..

మొదటి తరువాయి

నుంచి తప్పుకుంటానని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడీ వల్లే తెలంగాణ దివాలా తీస్తున్నదని విమర్శించారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదంటున్న రేవంత్ రెడ్డి, 72 సార్లు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు.కేసీఆర్ హయాంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి నిత్యం అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2023 వరకు తెలంగాణ అప్పు రూ.3.50 లక్ష?ల కోట్లని పార్లమెంటులో కేంద్రం చెప్పిందన్నారు. ఇందులో ఉమ్మడి రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు, కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.2.78 లక్షల కోట్లని వివరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ. 8.11 లక్షల కోట్లు అప్పు చేశారంటూ నిత్యం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అప్పులే కాకుండా రాష్ట్ర ఆదాయంతోపాటు అప్పులకు కడుతున్న వడ్డీ లెక్కలపైనా సీఎం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చెప్పింది నమ్మాలా?, కాగ్ చెప్పింది నమ్మాలా?అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికే రూ.1.13 లక్ష?ల కోట్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు చెప్పిన ఆర్థిక సహాయం చేయలేదన్నారు. రైతాంగానికి బాకీ పడ్డ రూ.1.13 లక్ష?ల కోట్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎకరానికీ రైతుభరోసా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రైతాంగానికి, విద్యార్థులకు, మహిళలకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# పిల్లలను వాషింగ్ మెషీన్‌లో పెట్టి చిత్రహింసలు



**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
బెంగళూరులోని ఓ ఐటీ క్యాంపస్‌లో ఉన్న డేకేర్ సెంటర్‌లో పిల్లలను శారీరకంగా హింసించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఐదుగురు మహిళా సంరక్షకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక్కడ ఉన్న రెండు నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలు ఏడ్చినా, అల్లరి చేసినా.. ఆయాలు వారిని బెదిరిస్తున్నట్లు ఆ వీడియోల్లో కనిపిస్తోంది. మరోవైపు పిల్లలను ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లో పెట్టడం, వెస్ట్రన్ టాయిలెట్‌పై కూర్చోబెట్టడం, టాయిలెట్ జెట్ స్ప్రే ఉపయోగించి నోటిలోకి నీళ్లు చల్లడం, బాత్‌రూమ్‌ల్లో బంధించడం వంటివి చేశారని ఆరోపణలు ఉన్నాయి.

# టీఎంసీ మహిళా ఎంపీపై కోడిగుడ్లతో దాడి



**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత... ఆ రాష్ట్రంలో రాజకీయ హింస తీవ్రరూపం దాల్చింది. ప్రతిపక్ష టీఎంసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా టీఎంసీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాపై దాడి జరిగింది. పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఓ దుకాణం వద్ద ఆమెపై కొందరు కోడిగుడ్లు విసిరారు. ఈ ఘటనను మహువా స్వయంగా ధృవీకరించారు. బీజేపీ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు మహువా ఆరోపించారు. రాష్ట్ర పోలీసుల వైఫల్యమే ఇలాంటి ఘటనలకు కారణమని ఆమె విమర్శించారు.

# ఆగష్టు 30న నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష.

**-దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.. కీలక డేట్స్ ఇవే**




**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
మెడికల్ విద్యార్థులకు 2026లో పీజీలో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ పీజీ ప్రవేశ పరీక్ష తేదీ వచ్చేసింది.
ఆగష్టు 30న నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకోసం దరఖాస్తుల ప్రక్రియ జూలై 1 సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైంది. దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేదీ జూలై 21, రాత్రి 11.55 గంటలు. ఈ పరీక్షను ఎన్‌బీఈఎంఎస్ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్) సంస్థ నిర్వహిస్తుంది. ఇటీవల నీట్ యూజీ పేపర్ లీక్ నేపథ్యంలో పీజీలో ప్రవేశం కోసం అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.కాపీయింగ్ జరగకుండా చాలా రూల్స్ అమలు చేయనుంది ఎన్‌బీఈఎంఎస్. టెస్ట్ సిటీ కేటాయింపు రూల్స్ మార్చేశారు. అంటే ముందుగా దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన కోరుకున్న సిటీలో ప్రవేశపరీక్ష రాసే అవకాశం ఉండదు. ఫస్ట్ కమ్.. ఫస్ట్ సర్వ్‌డ్ బేసిస్ విధానం ఉండదు. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు తప్పనిసరిగా మూడు రాష్ట్రాలను, అక్కడి సిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. వాటిలోంచే పరీక్ష రాసే సిటీలను కేటాయిస్తారు. ఆధార్ అథెంటికేషన్, బయోమెట్రిక్ రూల్స్‌ను తప్పనిసరి చేయనున్నారు. దీనికోసం విద్యార్థులు పరీక్ష రాసే సమయానికి చేతికి, వేళ్లకు హెన్నా, రంగులు వంటివి రాసుకుని ఉండకూడదు. ఇతరులతో అప్లికేషన్ వివరాలు పంచుకోకూడదు.అభ్యర్థులకు ఆగష్టు 11 నుంచి అడ్వాన్స్‌గా ఎగ్జామినేషన్ సిటీకి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. ఆగష్టు 30న ప్రవేశ పరీక్ష జరిగితే, సెప్టెంబర్ 30లోపు ఫలితాలు వెల్లడవుతాయి. దరఖాస్తు సందర్భంగా పరీక్షక సంబంధించిన నియమ నిబంధనల్ని అభ్యర్థులు తప్పనసరిగా చదవాలని ఎన్‌బీఈఎంఎస్ సూచించింది. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

# పడకేసిన తయారీ రంగం

**-మూడు నెలల కనిష్టానికి పీఎంఐ**



**న్యూఢిల్లీ జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, దేశీయంగా నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా భారత తయారీ రంగం మందగించింది. ఈ ఏడాది జూన్‌లో తయారీ రంగం వృద్ధి తగ్గిందని ఎస్ అండ్ పి గ్లోబల్ నిర్వహించిన హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఎగుమతులు, నియామకాల వేగం తగ్గడం ఈ పతనానికి ప్రధాన కారణాలని విశ్లేషించింది. పీఎంఐ సూచీ 50 పాయింట్ల కంటే పైన కొనసాగితే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ఇటీవల ఈ సూచీ పడిపోవడం ఆందోళకరం. గతేడాది మార్చి తర్వాత ఎగుమతులు అత్యంత బలహీనమైన వృద్ధిని నమోదు చేశాయి.

# పదమూడేళ్ల బాలికపై 30మంది సామూహిక అత్యాచారం..

**నిందితులకు చెందిన నాలుగు హోటళ్లు కూల్చివేత**



**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
రాజస్థాన్‌లో దారుణం జరిగింది. పదమూడేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. దాదాపు 30 మంది వరకు అత్యాచారం, లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను అధికారులు కూల్చేశారు. రాజస్థాన్‌లోని, శ్రీగంగానగర్‌కు చెందిన పదమూడేళ్ల బాలిక జూన్ 18న కిడ్నాప్‌నకు గురైంది. బాలికను స్థానిక రిక్షా కార్మికుడు ఎత్తుకెళ్లి ఒక హోటల్ నిర్వాహకుడికి ఇచ్చేశాడు.ఆ హోటల్ ఓనర్ బాలికపై హోటల్‌లో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఇతర హోటళ్లకు కూడా బాలికను తీసుకెళ్లాడు. అలా, నాలుగు హోటళ్లలో చిన్నారిపై అత్యాచారం, లైంగికదాడి జరిగింది. దాదాపు ఐదు రోజులపాటు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివిధ హోటళ్లలో మొత్తం 30 మంది వరకు ఈ దారుణానికి ఒడిగట్టారు. దీంతో బాలిక నొప్పితో ఇబ్బంది పడుతూ, ఏడుస్తుంటే తనకు ఆల్కహాల్ తాగించి, మరీ లైంగిక దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు లేదా అంతకుమించి హోటల్స్ ఓనర్స్ ప్రధాన పాత్ర పోషించారు. అంతేకాకుండా ఈ లైంగికదాడిని దాచిపెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నలుగురు ప్రధాన నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను బుధవారం బుల్డోజర్లతో కూల్చేశారు. ఈ ఘటనలో ఇప్పటివరకు మొత్తం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతావారి కోసం గాలిస్న?న్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హరిశంకర్ తెలిపారు. ఈ అత్యాచారంపై స్థానికుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారీ ఎత్తున నిరసనలు చేస్తున్నారు.

# హిందూ వివాహాలపై గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**సప్తపది లేని పెళ్లి పెళ్లే కాదు..**



**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతను చాటిచెబుతూ గుజరాత్ హైకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ సంప్రదాయాల ప్రకారం 'సప్తపది' (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు నిర్వహించకుండా కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చట్టబద్ధంగా చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టంచేసింది. హిందూ వివాహం అనేది కేవలం 'పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల' కోసం జరుపుకునే వేడుక కాదని వ్యాఖ్యానించింది. వధూవరులు పవిత్రమైన అగ్ని సాక్షిగా ఏడడుగులు వేయడమే వివాహానికి ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తుందని జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్‌టీ వాచ్ఛానిల బెంచ్ తేల్చిచెప్పింది.యూకేలో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తి అప్పీల్‌పై విచారణ జరుపుతూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళ తన సంతకాలను మోసపూరితంగా సేకరించి మ్యారేజ్ సర్టిఫికేట్ పొందిందని, తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. గతంలో ఫ్యామిలీ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సదరు మహిళ కూడా తమ మధ్య ఎలాంటి పెళ్లి ఆచారాలు జరగలేదని అంగీకరించింది. దాంతో హిందూ వివాహ చట్టం ప్రకారం సప్తపది లేని వివాహం అసలు పెళ్లే కాదని హైకోర్టు స్పష్టంచేసింది. గతంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ.. సప్తపది లేని పెళ్లి చెల్లదని తీర్పునిచ్చింది.

# వెనిజులాలో భారత నావికుడు మృతి..

**మృతదేహంలో మెదడు, గుండె, ఇతర అవయవాలు మాయం**



**లక్నో: జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
భారతీయ నావికుడు వెనిజులాలో పని చేస్తూ కార్గో షిప్‌లో మరణించాడు. నెల తర్వాత అతడి మృతదేహం భారత్‌కు చేరుకున్నది. పోస్ట్‌మార్టం నిర్వహించగా మెదడు, గుండె, ఊపిరితిత్తులు వంటి అంతర్గత అవయవాలు మాయమైనట్లు తేలింది. ఇది తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాకు చెందిన 33 ఏళ్ల రాకేష్ చౌహాన్ తన భార్య, ఆరు నెలల కుమారుడు, తండ్రి, సోదరుడితో కలిసి ముంబై నివసించాడు.కాగా, 2025 నవంబర్‌లో మర్చంట్ నేవీలో చేరిన రాకేష్ చౌహాన్, వెనిజులాలో మెరైన్ ఫిట్టర్‌గా పనిచేశాడు. ఈ ఏడాది మే 7న రాకేష్ ప్రమావశాత్తు నౌక డెక్‌పై పడి తీవ్రంగా గాయపడినట్లు అతడు పనిచేస్తున్న కంపెనీ నుంచి తండ్రికి ఫోన్ వచ్చింది. మరునాడు అతడి పరిస్థితి విషమంగా ఉన్నదని సమాచారం ఇచ్చారు. ఆ రోజు సాయంత్రం రాకేష్ చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించినట్లు ఆ కంపెనీ తెలియజేసింది. మరోవైపు సుమారు నెల రోజుల తర్వాత రాకేష్ మృతదేహం భారత్‌కు చేరుకున్నది. పరీక్షించిన వైద్య బృందం విదేశంలోనే పోస్ట్‌మార్టం జరిగినట్లు పేర్కొంది. తిరిగి పోస్ట్‌మార్టం నిర్వహించలేమని వైద్య బృందం తెలిపింది. అయితే ఈ విషయాన్ని కంపెనీ తమకు తెలియజేయలేదని అతడి కుటుంబం ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, డియోరియా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రాకేష్ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అయితే శరీరం లోపల అంతర్గత అవయవాలేవీ లేవని వైద్యులు గుర్తించారు. మెదడు, గుండె, ప్లీహం, కాలేయం, క్లోమం, పిత్తాశయం, రెండు మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, పేగులు, కరోనరీ ధమనులు, మూత్రాశయం, ఇతర అవయవాలు కూడా లేవని వెల్లడైంది. అంతేకాకుండా రాకేష్ శరీరంపై మెడ నుంచి మర్మాంగం వరకు, ఎడమ చెవి నుంచి కుడి చెవి వరకు మొత్తం 22 కుట్లు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఎలాంటి అంతర్గత అవయవాలు మిగలకపోవడంతో అతడి మరణానికి ఖచ్చితమైన కారణాన్ని ఫోరెన్సిక్ పరీక్షలో నిర్ధారించలేకపోయారు. మరోవైపు రాకేష్ మృతదేహంలోని అన్ని అవయవాలు మాయమైనట్లు తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. వెనుజులా సంస్థ కీలక సమాచారాన్ని దాచిపెట్టినట్లు ఆరోపించారు. రాకేష్ మరణంపై సమగ్ర విచారణ జరుపాలని, ఆర్థిక పరిహారం ఇవ్వాలని అతడి కుటుంబం డిమాండ్ చేసింది. కాగా, 'ఫెడరేషన్ ఆఫ్ సీఫేరర్స్ యూనియన్స్ ఆఫ్ ఇండియా' కూడా రాకేష్ మరణంపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. కుటుంబానికి తెలియజేయకుండా, వారి అనుమతి తీసుకోకుండా అతడి శరీరం నుంచి కీలక అవయవాలను ఎందుకు తొలగించారని నిలదీసింది. మృతదేహానికి సంబంధించిన రసీదు నకిలీదని, అతడి భార్య పేరును తప్పుగా పేర్కొన్నారని, ఉద్యోగ ఒప్పందంలో పేర్కొన్న నౌక పేరు, అతడు వాస్తవంగా పనిచేసిన నౌక పేరుతో సరిపోలడం లేదని ఆరోపించింది. 'ఈ వ్యత్యాసాలు పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఏమి దాస్తున్నారు? వెనిజులాలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే జోక్యం చేసుకోవాలని మేం కోరుతున్నాం' అని ఒక ప్రకటనలో యూనియన్ పేర్కొంది. రాకేష్ చౌహాన్ కుటుంబానికి న్యాయం, జవాబుదారీతనం, తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేసింది.

# అయోధ్య చోరీ కేసు.. 8 మందిలో ఎవరెంత దోచుకున్నారంటే?



**న్యూడీల్లి జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)**
యోధ్య రామాలయ నిధుల చోరీ కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితుల్లో లవ్ కుశ్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అత్యధిక అమౌంట్ చోరీ చేసినట్లు అంచనా వేస్తున్నారు. ఆ చోరీ సొత్తును ప్రాపర్టీల్లో ఇన్వెస్ట్ చేశారు. ఇప్పటి వరకు అరడజను పైగా ప్రాపర్టీలను ట్రేస్ చేశారు. ఆ ఇద్దరికి చెందిన ఆర్థిక లావాదేవీలను ఆదాయపన్ను శాఖ పరిశీలిస్తున్నది. డబ్బు చోరీ కేసులో ఈడీ కూడా దర్యాప్తు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కేసులో అత్యధిక నగదును అవినాశ్ శుక్లా నుంచి రికవరీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే.. అవినాశ్ శుక్లా ఇచ్చిన సమాచారం ప్రకారం 89 లక్షల నగదును పోలీసులు రికవరీ చేశారు. రెయిడ్ సమయంలో అతని కుటుంబానికి చెందిన ఓ యోగా సెంటర్ నుంచి మరో 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. లవ్ కుశ్ మిశ్రా పూర్వీకుల ఇంట్లో ఉన్న ఆవుపేడ కింద దాచిన 12 లక్షల నగదు కూడా రికవరీ చేశారు. ప్రతి నెలా కేవలం 12 వేల జీతం తీసుకునే మిశ్రా.. ఆలయ చోరీ సొత్తుతో భార్య పేరు మీద 25 లక్షల ఇళ్లు కట్టినట్లు గుర్తించారు. అతని బ్యాంక్ అకౌంట్లు, బినామీ ఆస్తులను పరిశీలిస్తున్నారు. మనిశ్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి ఇంటి నుంచి 36 లక్షలు రికవరీ చేశారు. రాంశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్‌కు చెందిన ఇంటి నుంచి క్యాష్, జ్యులరీ, ప్రాపర్టీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులను కూడా విచారించారు. టెంపుల్ విరాళాలను ఓ ప్రైవేటే ఏజెన్సీ ద్వారా ఆ బ్యాంకు కౌంటింగ్ నిర్వహిస్తోంది. నాలుగు డొనేషన్ బాక్సులకు చెందిన డబ్బును 14 మంది సభ్యుల బృందం లెక్కిస్తుంది. దీంట్లో 11 మంది బ్యాంకు ఉద్యోగులు, ముగ్గురు ఆలయ ట్రస్టు సభ్యులు ఉంటారు. నిందితులు అకౌంట్ రూమ్‌లోకి యాక్సెస్ సంపాదించి అక్రమ రీతిలో డబ్బును దోచుకున్నట్లు దర్యాప్తుదారులు అంచనా వేశారు. అనుమానిత వ్యక్తుల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే, వాళ్ల అకౌంట్లలో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. అయోధ్య విరాళాల చోరీ కేసులో అరెస్టు అయిన వారిలో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ్, రాంశంకర్ యాదవ్ ఉన్నారు. విరాళాల హుండీ నుంచి ఈ 8 మంది డబ్బులు దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో భారీ అక్రమాలు సమగ్ర విచారణ జరపాలి

**-పానుగంటి పర్వతాలు**
**అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మఇండ్లు కట్టించాలి.**
**-బుద్దుల జంగయ్య**
**ఆర్డీవో ఎస్ ఆర్ సరిత గారికి వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ):** డబ్బులు బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ఆరోపించారు ఈ సందర్భంగా షాద్నగర్ ఆర్డిఓ కార్యాలయం ముందల రాష్ట్ర సమితి పిలుపుమేరకు ధర్నా నిర్వహించారు ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు

బుద్ధుల జంగయ్య అధ్యక్షత వహించగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయింపులో భారీ అక్రమాలు జరిగాయని ఈ అక్రమాలు అధికారులకు రాజకీయ నాయకులకు తెలియకుండానే జరిగాయా అని ఆయన ప్రశ్నించారు గతబిఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు నిర్మించడంలో కూడా అక్రమాలు జరిగాయని ప్రజలకు అందుబాటులో లేని జాగలో ఇండ్లు నిర్మించారని 10 ఏళ్ల పాలనలో ఇండ్లు పంపిణీ చేయకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని అందుకే బీఆర్ఎస్ ను దించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలకు నిజమైన పేదలకు ఇండ్లు పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపి నిజాన్నినిగ్గు తేజాల్చిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు ఆర్డిఓ ఆఫీస్ లో కూడా రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని నిరుపేదల పనులు జరగకుండా అడ్డుపడుతున్నారని మా దృష్టికి వచ్చిందని అన్ని మాకు తెలిసే జరగాలని ఆర్డీవో కార్యాలయ అధికారులకు అధికార పార్టీ నాయకులు హుకుం జారీ చేశారని ఇదెక్కడి పరిపాలన అని ఆయన ప్రశ్నించారు ప్రజా పాలన అంటే ఇదేనా అని ఆయన అన్నారు రాజకీయ నాయకుల తీరు మారకపోతే రెవెన్యూ అధికారులు ప్రజల పనులు చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుబుద్దుల జంగయ్య మాట్లాడుతూ కొందుర్గు మండలం ఎనెగడ్డలో సర్వేనెంబర్ 237లో అప్పటి ప్రభుత్వం 2008లో ఇండ్ల పట్టాలు పంచిందని కానీ పొజిషన్ చూయించలేదని వెంటనే పొజిషన్ చూయించి అక్కడే ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆయన అన్నారు చౌదర్ గూడా మండల కేంద్రం లో సర్వేనెంబర్ 142లో 42 మందికి పట్టాలు తయారు చేశారు కానీ పంపిణీ చేయలేదు పొజిషన్ చూయించలేదు వెంటనే పట్టాలు పంచి పొజిషన్ చూయించి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆయనడిమాండ్ చేశారు కేశం పేట మండలం వేములనర్వ గ్రామంలో సర్వే నెం232.234 నక్ష బాట ను అలాగే సర్వేనెం272.317 రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని చెరువును కూడాఒక ప్రైవేటు వెంచర్ భూవాక్రమణకు పాల్పడితే సోషల్ మీడియాలో పత్రికలలో వచ్చిన కూడా రాజకీయ నాయకులు రెవెన్యూ అధికారులు అంతిముట్ట నట్టు వ్యవహరించడంలో ఉద్దేశం ఏంటి సమాధానం చెప్పాలన్నారు ప్రభుత్వం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను కాపాడటానికి చేయడానికి ఆయన త్రివిధ స్థాయిలో మండిపడ్డారు రెవెన్యూ అధికారుల తీరు మారకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని ఎస్సీ ఎస్టీలకు ఆరు లక్షల ఇస్తామన్న ఎన్నికల హామిని నిలబెట్టుకుని వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన అన్నారు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తుందని నిజమైన పేదలు అరులైన లబ్ధిదారులు అనేకమంది ఇందిర ఇండ్లు మంజూరు కాక ఎదురుచూస్తున్న పరిస్థితు ఉందని ఆయన ఆర్డిఓ దృష్టికి తీసుకువచ్చారు వెంటనే వారందరి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి జాగ లేనివారికి 60 గజాల జాగా కేటాయించి ఇండ్లు కట్టించి వాలని ఆయన డిమాండ్ చేశారు పలు డిమాండ్లతో కూడిన విన్నది పత్రాన్ని ఆర్డిఓ సరిత గారికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లేడు చౌదరిగుడా సిపిఐ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్ కొత్తూరు మండల కార్యదర్శి ఎండి షకిల్ కేశంపేట మండల కార్యదర్శి గోవిందు నాయక్ జిల్లేడు చౌదరిగుడా మండల సహాయ కార్యదర్శి ఎండి షబ్బీర్ ఫరూక్నగర్ మండల సహాయ కార్యదర్శి రమేష్ యాదవ్ సిపిఐ నాయకులు జి యాదయ్య యాదగిరి ఎల్లయ్య మైసయ్య మైబూబ్ మస్రుద్ షబ్బీర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బాధితులు ఇందిరమ్మ ఇండ్ల బాధితులు ఇండ్ల స్థలాల బాధితులు తదితరులు పాల్గొన్నారు

## షాద్ నగర్ లో ఘనంగా ప్రముఖ సామాజిక వేత్త పాతూరి వెంకటరావు జన్మ దిన వేడుకలు


**- శ్రామిక బడిలో కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిల పంపిణీ.**
**నవోదయ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ)** ప్రముఖ సామాజిక వేత్త, పౌల్ట్రీ ఫార్మర్ పాతూరి వెంకట్రావు 72 వ జన్మదినం సందర్భంగా షాద్ నగర్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు పౌల్ట్రీ కార్మికుల పిల్లలకు నిర్వహిస్తున్న శ్రామిక బడి లో విద్యార్థిని విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం షాద్ నగర్ నవోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలానే షాద్ నగర్ లో నిర్వహిస్తున్న పేదలకు పది రూపాయల భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ రైతులు పాతూరి బ్రహ్మయ్య, కొర్రపాటి మోహన్రావు, కొల్లా శివ మోహన్ రావు, బండారుపల్లి నాగేశ్వరరావు, కొర్రపాటి శ్రీనివాసరావు, కొత్త ప్రభాకర్, బండారుపల్లి వెంకటేశ్వరరావు, నందు, కృష్ణారావు, గుదే శ్రీకాంత్, బొల్లినేని కోటేశ్వరరావు, పేరం అనిల్ కుమార్, కూ కుట్లలక్ష్మీనారాయణ, కిలారు సాంబశివరావు, పాతూరి రామ సుబ్బారావు, మొక్కపాటి మల్లేశ్వరరావు, కొర్రపాటి వెంకటరావు, కిలారు రఘురాం, ఆలపాటి పూర్ణ, నువ్వుల నాగేశ్వరరావు, కూకుట్ల సత్యనారాయణ, పాతూరి సత్యనారాయణ, పాతూరీవిద్యాసాగర్, మన్నవ సత్యనారాయణ మూర్తి, నువ్వుల నాగేశ్వరరావు మరియు సురేష్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పట్వారి శ్రావణ్ కుమార్ నూతన గృహప్రవేశం

**- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ ) :** షాద్ నగర్ లోని ఈదులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పట్వారి శ్రావణ్ కుమార్ షాద్ నగర్ పట్టణంలోని విజయ్ నగర్ కాలనిలో నూతన గృహప్రవేశ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహంలో సుఖశాంతులు, ఐశ్వర్యం,ఆనందం నిండాలని ఆకాంక్షిస్తూ శ్రావణ్ కుమార్ కుటుంబ సభ్యులకు తన హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్,కౌన్సిలర్ పిల్లిశారదా శేఖర్,మాజీ కౌన్సిలర్లు విజయకుమార్ రెడ్డి,యుగేందర్,చెట్ల నర్సింహులు,జూపల్లి శంకర్,మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్,నాయకులు జయరాం గౌడ్,శేఖర్ రెడ్డి,శేఖర్,శ్రీహరి, అన్వారీ రాజు,తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో భరోసా సి.డి.ఈ.డబ్ల్యు (CDEW) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ను ప్రారంభించిన డీసీపీ శిరీషా రాఘవేంద్ర.






**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో గృహహింస, లైంగిక వేధింపులు మరియు కుటుంబ సమస్యలకు గురైన మహిళలు, బాధితులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రమే భరోసా సి.డి.ఈ.డబ్ల్యు (CDEW) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్. మహిళలు మరియు ఇతర బాధితులకు త్వరితగతిన సేవలు అందించాలనే లక్ష్యంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బుధవారం షాద్‌నగర్ డీసీపీ శిరీషా రాఘవేంద్ర ప్రారంభించారు. బాధితులకు అన్ని సేవలు ఒకేచోట ఈ సందర్భంగా డీసీపీ శిరీషా రాఘవేంద్ర మాట్లాడుతూ, భరోసా సి.డి.ఈ.డబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా మహిళలు మరియు ఇతర బాధితులకు చట్టపరమైన సలహాలు, మానసిక పరామర్శ, కుటుంబ కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సహాయ సేవలను ఒకే చోట అందజేస్తామని తెలిపారు. షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బాధితులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ముందుకు వచ్చి ఈ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, పోలీసు అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే సి.డి.ఈ.డబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ కౌన్సిలర్ ప్రసన్న లక్ష్మి, రిసెప్షనిస్ట్ అనిత మరియు ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## గిరిజన గుండె చప్పుడు 'ఎల్‌హెచ్‌పీఎస్'..

**-షాద్‌నగర్‌లో ఘనంగా 30వ ఆవిర్భావ దినోత్సవం**
**-ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్**
**-'మా తండాలు -మా రాజ్యం' సాధించుకున్నాం.. ఇప్పుడు రెవెన్యూ గ్రామాల సాధనే లక్ష్యం**
**-బంజారా (గోర్ బోలి) భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గిరిజన నాయకులు, విద్యావేత్తలు, వైద్యులు, యువత పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సంఘ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన వేడుకలు ఆకట్టుకున్నాయి.

**25 ఏళ్ల పోరాట ఫలితమే 'మా తండాలు -- మా రాజ్యం'**

జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో రాంబాల్ నాయక్ మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా గిరిజనుల హక్కుల సాధన కోసం ఎల్‌హెచ్‌పీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అనేక అడ్డంకులు, సవాళ్లను ఎదుర్కొంటూ సాగిన 25 ఏళ్ల ఉద్యమ ఫలితంగానే 'మా తండాలు -- మా రాజ్యం' అనే నినాదం సాకారమై, తండాలను గ్రామ పంచాయతీలుగా సాధించుకున్నామని తెలిపారు. ఈ చారిత్రక విజయంతో గిరిజనులు రాజకీయంగా, పరిపాలనాపరంగా స్వయంపాలన దిశగా ముందడుగు వేశారని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో గిరిజనుల పాత్ర మరింత పెరిగిందని వివరించారు. ప్రతి తండాను రెవెన్యూ గ్రామంగా మార్చే వరకు పోరాటం భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడిన ఆయన, తండాలను కేవలం పంచాయతీలుగా మార్చడం ఉద్యమం అంతిమ లక్ష్యం కాదన్నారు. ప్రతి గిరిజన తండాను పూర్తి స్థాయి రెవెన్యూ గ్రామంగా గుర్తింపు పొందే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ హోదా ద్వారా భూముల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు.

**'గోర్ బోలి'కి రాజ్యాంగ గుర్తింపు కల్పించాలి**

లంబాడీల మాతృభాష అయిన గోర్ బోలి (బంజారా) భాషకు అధికారిక గుర్తింపు కల్పించాలని రాంబాల్ నాయక్ డిమాండ్ చేశారు. కోట్లాది మంది మాట్లాడుతున్న ఈ ప్రాచీన భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని, గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ప్రముఖులకు ఘన సన్మానం ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గిరిజన సమాజ అభ్యున్నతికి సేవలందించిన పలువురు నాయకులు, వైద్యులు, విద్యావేత్తలను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మీట్టు నాయక్, వాల్యా నాయక్, విస్లావత్ చందర్ నాయక్, ఎస్. లక్ష్మణ్ నాయక్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చందులాల్ రాథోడ్, నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్, మోతీలాల్ నాయక్, జరుపల రాజు నాయక్, గోపాల్ నాయక్, బాబురాజ్ నాయక్, సంతోష్ నాయక్, చందర్ నాయక్, మెగావత్ రాము, సంజు నాయక్, అయోధ్య శ్రీనివాస్, రాజేష్ నాయక్, శివా నాయక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రమజీవుల పక్షాన నిలిచిన తత్వవేత్త, ధీరోదాత్తుడు.

**-ప్రపంచ మానవాళి విముక్తి కోసం అహర్నిశలు పరితపించిన మేధావి కారల్ మార్క్స్.**
**-సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి.**
**-లండన్ సిటీలోని హైగేట్ పార్క్ లో కారల్ మార్క్స్ స్మృతి వనంలో నివాళి.**

**తెలంగాణ బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ)** లక్ష్యసాధన కోసం బూర్జువా ప్రభుత్వాలను ఎదురించి అనునిత్యం శ్రమజీవుల హక్కుల కోసం వారి సంక్షేమం కోసం కృషి చేసిన అభ్యుదయవాది కారల్ మార్క్స్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కొనియాడారు. కారల్ మార్క్స్ భావజాలం ప్రపంచ దేశాలు అనుసరించి కారల్ మార్క్స్ ని ప్రపంచ నాయకుణ్ణిగా,ప్రపంచ తత్వవేత్తగా నిలబెట్టాయి అని అన్నారు. లండన్ సిటీలోని



హైగేట్ పార్క్ లో కారల్ మార్క్స్ స్మృతి వనంలో వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి కుటుంబసభ్యులతో నివాళులు అర్పించారు.

# శ్రీ జగన్నాథ రథయాత్రకు మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ ) :** షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ను కళింగ కల్చరల్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రథయాత్ర కార్యక్రమం విశిష్టతను వివరించి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్‌తో పాటు కళింగ కల్చరల్ కమిటీ సభ్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# నకిలీ అగ్రిమెంట్ తో రూ. 1.80కోట్ల మోసం..అరెస్ట్....



**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** నకిలీ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ పత్రాలతో రూ. 1.80 కోట్ల రియల్ ఎస్టేట్ మోసానికి పాల్పడిన గుంజి చిరంజీవిని కీసర పోలీసులు అరెస్ట్ చేసారు. ఫిర్యాదు దారుడిని అక్రమంగా నిర్భంధించి, బెదిరించి రూ. 50 వేల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడి వద్ద నుంచి నకిలీ పత్రాలు, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇంటి దగ్గర పార్క్ చేసిన బండిని దొంగిలించిన దుండగులు

**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని దుండగులు దొంగిలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఉదయం 6 గంటలకు చుసేసరికి స్కూటి కనిపించకపోవడంతో బాధితుడు కీసర పోలీసులకు పిర్యాదు చేసాడు. బండి తాళాలు ఇంట్లోనే ఉండి బండి మాయం కావడంతో
ఎవరో దొంగలు రాత్రి 12 - ఉదయం 6 మద్య లో ఎత్తు కెల్లారని గుర్తించిన బాధితుడు పోలీసులకు కంప్లేట్ ఇవ్వడం జరిగింది. కాగా దయచేసి ఎవరికి అయినా కనబడితే ఈ కింది సెల్ నెంబర్ కు లేదా పోలీసులకు తెలపాలని బాధితుడు కోరారు. తన పేరు బాల్ రెడ్డి అని, అహ్మద్ గూడ అని తెలిపారు. నా సెల నెంబర్: 9392534789 తెలిపారు.




# శిల్పా లేఅవుట్ ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా కొత్త యుటర్న్ కు ప్రయత్నాలు....

**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** శిల్పా లేఅవుట్ దగ్గర ట్రాఫిక్ నియంత్రణ కు
ప్రధాన రహదారిపై ఒక ప్రయోగాత్మక 'యు-టర్న్' ఏర్పాటును అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాబోయే పది రోజుల పాటు ట్రాఫిక్ కదలికలను పర్యవేక్షించిన తర్వాత, ఈ యు-టర్న్ యొక్క తుది స్థానాన్ని నిర్ణయిస్తామని వారు తెలిపారు. స్థానికులు సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు, శిల్పా లేఅవుట్ ప్రధాన ప్రవేశ ద్వారం ఎదురుగా లేదా దానికి కొంచెం ముందుగా యు-టర్న్ ఏర్పాటు చేయాలని 'టీమ్ జాక్' కోరిన నేపథ్యంలో తాజా సమాచారం మేరకు, అధికారులు రాబోయే పది రోజుల్లో తమ నిర్ణయాన్ని ఖరారు చేస్తారని టీమ్ జాక్ సభ్యులు తెలిపారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధిపై ఆరెకపూడి గాంధీ సమీక్ష సమస్యల పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం

**- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన గాంధీ.**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జలమండలి ఈడీ సంతోష్ రెడ్డి, జీఎం కృష్ణ, జీఎం హరిశంకర్, తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం జరిపిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... మంచి నీటి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, పనితీరు పై అధికారులతో చర్చించడం జరిగినది. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకొని అత్యవసర పనుల పై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదు పై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండలని , ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో అధికారులు ఉండలని తెలియచేసారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా లో అంతరాయం లేకుండా చూడలని, ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలని, కలుషితం కలుగకుండా చూడలని, స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలని అధికారులకు తెలియచేసారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర , సంతులిత అభివృద్ధి లో భాగంగా ప్రతి డివిజన్ల లో మౌళికవసతుల కల్పన కొరకై ప్రతి డివిజన్ లో అవసరమైన ప్రతిపాదనలు తీసుకోవడం జరిగినది అని,పనులు త్వరిత గతిన చేపట్టాలని, అత్యవసర పనుల ను గుర్తించి,ప్రథమ ప్రాధాన్యత గా పనులు గుర్తించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేసిన అదేవిధంగా అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి పై సమీక్షా జరపడం జరిగినది. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలియచేసారు. మురుగు నీరు పొంగకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజి వ్యవస్థ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని , ఎక్కడ పొంగి పొర్లకుండా చూడలని, పైప్ లు మిగిలిపోయిన చోట మార్చాలని అవసరమున్న చోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ మరియు మంచి నీటి పైప్ లైన్ కొరకు ప్రతిపాదనలు తీసుకోవాలని, పనులు ప్రథమ ప్రాధాన్యత గుర్తిచి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని , విధులలో అలసత్వం ప్రదర్శించకూడదు అని , ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని అధికారులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డి.జి.ఎం శ్రీమాన్ నారాయణ, డి.జి.ఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ వైద్య శిబిరంను ప్రారంభించిన గాంధీ.

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ రిక్రియేషన్ క్లబ్ లో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ వైద్య శిబిరంను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ వారి సేవలు అమోఘం అని , క్యాన్సర్ పై అవగాహన కల్పించడం గొప్ప విషయం అని, క్యాన్సర్ ను ముందే పసిగడితే సగం విజయం సాధించినట్టే, అన్ని రకాల పరీక్షలకు చేసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగినది. ఇక్కడి పరిసర ప్రాంత పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని,.రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు వైద్య శిబిరం ఎంతగానో తోడ్పడుతుంది అని తెలియచేసారు. ఇందులో భాగంగా. స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగినది అని, తెలియజేసారు. ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను, డాక్టర్లను ప్రత్యేకంగా అభినదించడం జరిగినది. ప్రతి ఒక్కరు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అంతే కాకుండా సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల నుండి అనూహ్య స్పందన లభించి, ఈ శిబిరంలో 211 మంది లబ్ధిదారులు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్నారు. వీరిలో 106 మంది పురుషులు, 105 మంది మహిళలు ఉన్నారు. అందించిన వైద్య సేవలలో 63 పాప్ స్మియర్ పరీక్షలు, 58 అల్ట్రాసౌండ్ స్కాన్లు, 30 మామోగ్రఫీ పరీక్షలు, 7 సోనోగ్రఫీ పరీక్షలు, 5 ఎక్స్-రే పరీక్షలు ఉన్నాయి. తదుపరి వైద్య పరీక్షలు అవసరమైన 5 మంది రోగులను మెరుగైన నిర్ధారణ మరియు చికిత్స కోసం బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమం జాతీయ వైద్యుల దినోత్సవం మరియు చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం రోజున జరగడం గొప్ప విశేషం అని తెలియచేశారు. వైద్యులు మరియు చార్టర్డ్ అకౌంటెంట్లను సత్కరించి, సమాజానికి వారుఅందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో వైద్యుల అంకితభావాన్ని, ఆర్థిక పారదర్శకత, నైతిక విలువలు మరియు ఆర్థికాభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్ల కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. ఈ రెండు వృత్తులు దేశ నిర్మాణంలో కీలకమని తెలియచేశారు.
ఈ శిబిరం ఘన విజయవంతం కావడానికి సహకరించిన అధ్యక్షులు రోటేరియన్ ఎం. నాగ రాజు, కార్యదర్శి రోటేరియన్ డా. కె.ఆర్.ఎన్. కిరణ్ కుమార్, కార్యక్రమ నిర్వాహకులు రోటేరియన్ కె. వేణుబాబు, వివేకానంద నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, నాయి నేని చంద్రకాంత్ రావు, బసవతారకం హాస్పిటల్ వైద్య బృందం, రోటరీ సభ్యులు మరియు వాలంటీర్లకు రోటరీ క్లబ్ కృతజ్ఞతలు తెలియజేసింది. విలువైన ఉనికి మరియు ప్రోత్సాహం అందించిన రోటేరియన్ జి. శివ శంకర రావు, రోటేరియన్ ఎం. వి. రమణ రావు, రోటేరియన్ శివ రామ కృష్ణ ప్రసాద్, పాస్ట్ ప్రెసిడెంట్ రోటేరియన్ రవీంద్ర వర్మ లకు ప్రత్యేక అభినందనలు. 900 మందికి పైగా ప్రజలకు ఈ-మెయిల్ ద్వారా విస్తృత అవగాహన కల్పించి, అద్భుతమైన సమన్వయం చేసిన ఎం. విజయ భాస్కర్ కి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రచారం కారణంగా ప్రజల భాగస్వామ్యం విశేషంగా పెరిగింది. "యునైట్ ఫర్ గుడ్" అనే రోటరీ థీమ్ కింద, ఇలాంటి అర్థవంతమైన సేవా కార్యక్రమాల ద్వారా సమాజ ఆరోగ్య సంరక్షణ మరియు క్యాన్సర్ నివారణ అవగాహనకు తాము కట్టుబడి ఉన్నామని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో. అధ్యక్షులు రోటేరియన్ ఎం. నాగ రాజు, కార్యదర్శి రోటేరియన్ డా. కె.ఆర్.ఎన్. కిరణ్ కుమార్, కార్యక్రమ నిర్వాహకులు రోటేరియన్ కె. వేణుబాబు, వివేకానంద నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, నాయి నేని చంద్రకాంత్ రావు,, దేవినేని ప్రసాద్, మేకా శివరామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభీ కాలనీ లో రూ. 4.50 నాలుగు లక్షల యాభై వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... సురభీ కాలనీ లో కాలనీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 4.50 నాలుగు లక్షల యాభై వేల రూపాయలతో అన్ని హంగులతో , సకల సౌకర్యాలతో కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, సురభీ కాలనీ వారు ఇతర కాలనీ లకు ఆదర్శంగా నిలిచారు అని, భవనంను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ఈ రోజు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయం అని ,కమ్యూనిటీ హాల్ ను కాలనీ సంక్షేమం ,అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం



నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని ,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని తెలియచేశారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కాలనీ ని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన విలేజ్ గా తీర్చిదిద్దడం జరిగినది అని, అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగినది అని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, లింగంపల్లి విలేజ్ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచింది అని తెలియచేసారు .శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని తెలియచేస్తారు. లింగంపల్లి డివిజన్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది అని , పూర్తి స్థాయిలో పనులు జరిగాయి అని, ఒకప్పటి లింగంపల్లి అండర్ పాస్ సమస్య శాశ్వత పరిష్కారం చూపమని, త్వరలోనే ట్రాఫిక్ రహిత సమాజం కోసం ఆర్వోబీ ఫ్లై ఓవర్ ను నిర్మించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, సంక్షేమం తో పాటు అభివృద్ధి కొనసాగిస్తామని అన్నారు. ఏ చిన్న సమస్య ఆయిన తన దృష్టికి గాని తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ,మీకు ఎల్లవేళలో అందుబాటులో ఉంటామని తెలియచేసారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్,కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కొత్తగూడ నేరెళ్ల చెరువులో జరుగుతున్న సుందరికరణ సంరక్షణ, అభివృద్ధి పనులను పరిశీలించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 01 (జర్నలిస్ట్ డైరీ) :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ నేరెళ్ల చెరువు లో జరుగుతున్న సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... నేరెళ్ల చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని, నేరెళ్ల చెరువు ను సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని, చెరువును అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని,చుట్టుపక్కల కాలనీ వాసులు , వాకర్స్ కి ఇబ్బంది లేకుండా చూస్తామని, వాకర్స్ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకోవడానికి వీలుగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలియచేశారు . చక్కటి ఆహ్లాదకమైన వాతావరణం కల్పిస్తామని , వర్షాకాలం లో వచ్చే వరద నీటి నీ ఒడిసిపట్టుకోవాలని, చెరువు ఇన్ లెట్ లో చెత్త చెదారం లేకుండా చూడాలని, ఇన్ లెట్ ,ఔట్ లెట్ లను సరి చేయాలని,నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని,చెరువు చుట్టు జరుగుతున్న ఫెన్సింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, , చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలని,పనులు నాణ్యత ప్రమాణాల తో చేపెట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని తెలియచేసారు, చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ,చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,



మురుగు నీటి మల్లింపు పైప్ లైన్ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలంగా , చక్కటి ఆహ్లాదకరం గా చెరువు ను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని , చెరువు చుట్టూ పక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో సాంత్వన నేటితో చేకూరింది అని తెలియచేసారు ,ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని పనులు వేగవంతం చేయాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని తెలియచేసారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్ఠం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మల్లింపు పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని , చెరువు సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని తెలియచేసారు . అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా కైదమ్మ చెరువును సుందరవనంగా , శోభితవర్ణం గా తీర్చిదిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ల ను సంరక్షిస్తామని తెలియచేసారు . చెరువు ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది .చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను ,అనారోగ్యాలకు గురవడం స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే గారికి పిర్యాదు చేయడం వలన దీనికి స్పందించిన చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క ను తొలగించి, చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేసిన సంగతి విదితమే .అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగినది , తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది .చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ,చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని , చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి ,ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ కార్యకర్తలు, కాలనీ వాసులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ వ్యవస్థలో వేగంగా మార్పులు-కొత్త సవాళ్లు



భారతీయ సమాజానికి కుటుంబ వ్యవస్థ వేల సంవత్సరాలుగా ప్రధాన బలంగా నిలిచింది. వ్యక్తి జననం నుంచి జీవితాంతం వరకు కుటుంబమే అతనికి తొలి పాఠశాల, తొలి రక్షణ వ్యవస్థ, తొలి సామాజిక సంస్థ. సంప్రదాయాలు, సంస్కృతి, విలువలు, ఆర్థిక భద్రత, సామాజిక బాధ్యతలు అన్నీ కుటుంబ వ్యవస్థ ద్వారానే తరతరాలకు చేరాయి. అయితే గత ఏడు దశాబ్దాల్లో భారతదేశంలో చోటుచేసుకున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విద్యా విస్తరణ, మహిళల ఉపాధి, సమాచార సాంకేతిక విప్లవం, జనాభా మార్పులు కుటుంబ వ్యవస్థ స్వరూపాన్నే గణనీయంగా మార్చేశాయి. ఈ మార్పును కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నంగా కాకుండా, మారుతున్న సామాజిక-ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా జరిగిన పరిణామంగా చూడాలి.స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత సమాజం. ఉమ్మడి కుటుంబాలు, భూమి ఆధారిత జీవన విధానం, అధిక సంతానం, కుటుంబ సభ్యులందరూ కలిసి పని చేయడం సాధారణంగా ఉండేది. కుటుంబం ఉత్పత్తి కేంద్రంగా పనిచేసేది. వ్యవసాయం, కుటుంబ వృత్తులు, చేతివృత్తులు అన్నీ కుటుంబ సభ్యుల సమిష్టి కృషిపైనే ఆధారపడి ఉండేవి.కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ఉద్యోగాల కోసం గ్రామాల నుంచి పట్టణాలకు, దేశం నుంచి విదేశాలకు వలసలు పెరిగాయి. కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తూ సంపాదిస్తున్నారు. కుటుంబం ఇప్పుడు ఉత్పత్తి కేంద్రం కాకుండా వినియోగ కేంద్రంగా మారింది. ఈ మార్పు వల్ల చిన్న కుటుంబాల సంఖ్య వేగంగా పెరిగింది. ఉమ్మడి కుటుంబాలు పూర్తిగా అంతరించిపోలేదు కానీ వాటి ప్రాధాన్యం గణనీయంగా తగ్గింది.భారతదేశ జనాభా గణాంకాలు కూడా ఈ మార్పును స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 1951లో ఒక మహిళ సగటున దాదాపు ఆరు మంది పిల్లలకు జన్మనిస్తే, ప్రస్తుతం ఆ సంఖ్య ఇద్దరు పిల్లలకు చేరువైంది. జాతీయ స్థాయిలో సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయి (రీ ప్లేస్ మెంట్ లెవెల్ ) కంటే దిగువకు చేరుకోవడం భారత జనాభా చరిత్రలో అత్యంత కీలకమైన మార్పు. దీనివల్ల భవిష్యత్తులో జనాభా పెరుగుదల మందగిస్తుంది. చిన్న కుటుంబాలు మరింత పెరుగుతాయి. అదే సమయంలో వృద్ధుల జనాభా కూడా వేగంగా పెరుగుతుంది.

గృహాల పరిమాణం తగ్గడం మరో ప్రధాన పరిణామం. ఒకప్పుడు ఒకే ఇంట్లో మూడు లేదా నాలుగు తరాలు కలిసి జీవించేవి. ఇప్పుడు తల్లిదండ్రులు, ఒకటి లేదా ఇద్దరు పిల్లలతో కూడిన చిన్న కుటుంబాలు సాధారణమయ్యాయి. కుటుంబ సభ్యుల సంఖ్య తగ్గినా మొత్తం గృహాల సంఖ్య మాత్రం పెరుగుతోంది. దీనికి కారణం పెద్ద కుటుంబాలు అనేక చిన్న కుటుంబాలుగా విడిపోవడమే.

మహిళల జీవితాల్లో గత కొన్ని దశాబ్దాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. విద్య, ఉపాధి, ఆస్తి హక్కులు, ఆర్థిక స్వావలంబన పెరిగాయి. అయితే మరోవైపు ఉద్యోగ బాధ్యతలతో పాటు ఇంటి పనులన్నీ నిర్వహించాల్సిన "ద్వంద్వ భారం" ఇప్పటికీ మహిళలపైనే ఎక్కువగా ఉంది. చట్టపరంగా సమాన హక్కులు ఉన్నప్పటికీ, కుటుంబ నిర్ణయాలు, ఆస్తి పంపకం, వరకట్నం వంటి అంశాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయి.వివాహ వ్యవస్థలో కూడా గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. బాల్య వివాహాలు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. చదువు, ఉద్యోగాలు, కెరీర్ అవకాశాల వల్ల వివాహ వయస్సు పెరుగుతోంది. అయినప్పటికీ వివాహం ఇప్పటికీ భారతీయ సమాజంలో అత్యంత బలమైన సామాజిక సంస్థగానే కొనసాగుతోంది. పాశ్చాత్య దేశాల్లో కనిపించే సహజీవనం లేదా వివాహేతర కుటుంబ వ్యవస్థలు భారతదేశంలో ఇంకా పరిమితంగానే ఉన్నాయి.అయితే వివాహ వ్యవస్థతో ముడిపడి ఉన్న ఆర్థిక భారం మాత్రం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వరకట్నం, ఆడంబరమైన పెళ్లిళ్లు, బంగారం, ఖరీదైన విందులు, సామాజిక ప్రతిష్ఠ కోసం చేసే అధిక ఖర్చులు లక్షలాది కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఒక వివాహం కోసం సంవత్సరాల పొదుపు ఖర్చు చేయడం, అప్పులు చేయడం ఇప్పటికీ కొనసాగుతోంది. పెళ్లి అనేది ఆనంద వేడుక కంటే సామాజిక ప్రతిష్ఠ ప్రదర్శనగా మారుతున్న ధోరణి కూడా ఆందోళన కలిగిస్తోంది.

భారతీయ కుటుంబ వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య లింగ అసమానత. వైద్య సాంకేతికత అభివృద్ధి, కుమారుడిపై సామాజిక మొగ్గు, వరకట్నం వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ఆడ శిశువుల సంఖ్య తగ్గింది. గత రెండు దశాబ్దాల్లో ఈ పరిస్థితి కొంత మెరుగుపడుతున్నప్పటికీ, లింగ సమానత్వం ఇంకా పూర్తిగా సాధించలేకపోయాం. మహిళలపై వివక్ష కేవలం పేదరికంతోనే సంబంధం కలిగి ఉండదని, సామాజిక భావజాలంతో కూడా ముడిపడి ఉందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.భారతదేశానికి ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా ఉంది. 16 నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు గల కోట్లాది యువత దేశ ఆర్థికాభివృద్ధికి గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. దీనినే "జనాభా డివిడెండ్" అంటారు. అయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు తప్పనిసరి. లేకపోతే ఇదే యువ జనాభా భవిష్యత్తులో నిరుద్యోగం, సామాజిక అసంతృప్తి, ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది.

ఇక రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ కుటుంబ వ్యవస్థ మరింత కొత్త సవాళ్లను ఎదుర్కోనుంది. వృద్ధుల సంఖ్య వేగంగా పెరగనుంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో వృద్ధుల సంరక్షణ సులభంగా జరిగేది. ఇప్పుడు చిన్న కుటుంబాల వల్ల ఆ బాధ్యత కొద్దిమంది సభ్యులపై పడుతోంది. ముఖ్యంగా ఉద్యోగాలు చేసే మహిళలపై పిల్లల సంరక్షణతో పాటు వృద్ధుల సంరక్షణ భారం కూడా పెరిగే అవకాశం ఉంది.వివాహ వయస్సు మరింత పెరగడం, కొందరు వివాహం చేసుకోకుండా ఉండటం, ఒంటరిగా నివసించే వారి సంఖ్య పెరగడం వంటి ధోరణులు కూడా భవిష్యత్తులో మరింత స్పష్టంగా కనిపించవచ్చు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, విదేశాలకు వలసలు పెరగడం వల్ల కుటుంబ సభ్యులు భౌగోళికంగా దూరమవుతున్నారు. దీనివల్ల కుటుంబ బంధాలు కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

భారతీయ కుటుంబ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులను కేవలం సంప్రదాయాల పతనంగా చూడడం సరైంది కాదు. ఇవి సమాజంలో జరుగుతున్న ఆర్థిక, జనాభా, సాంకేతిక, విద్యా మార్పుల సహజ పరిణామాలు. అయితే ఈ మార్పులతో పాటు పెరుగుతున్న అసమానతలు, వరకట్నం, లింగ వివక్ష, మహిళలపై ద్వంద్వ భారం, వృద్ధుల సంరక్షణ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరం.

ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి చట్టాలు మాత్రమే సరిపోవు. మహిళల ఆర్థిక సాధికారత, సమాన ఆస్తి హక్కుల అమలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య, యువతకు ఉపాధి, సామాజిక భద్రతా వ్యవస్థలు, వృద్ధుల సంక్షేమం, వరకట్న వ్యతిరేక సామాజిక ఉద్యమాలు, కుటుంబ విలువలపై అవగాహన వంటి బహుముఖ చర్యలు అవసరం.

మొత్తంగా చూస్తే భారతీయ కుటుంబ వ్యవస్థ అంతరించిపోవడం లేదు; కొత్త పరిస్థితులకు అనుగుణంగా తనను తానుపునర్నిర్మించుకుంటోంది. కుటుంబ నిర్మాణం మారవచ్చు, జీవనశైలి మారవచ్చు, కానీ కుటుంబం అనే సామాజిక సంస్థ ప్రాధాన్యం తగ్గదు. అయితే సమానత్వం, పరస్పర గౌరవం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, బాధ్యతాయుతమైన కుటుంబ విలువలను బలోపేతం చేసినప్పుడే ఈ మార్పులు భారత సమాజ అభివృద్ధికి నిజమైన బలంగా మారతాయి.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# ఘనంగా డాక్టర్స్ డే... డా ఎల్ సురేష్ కి ఘన సన్మానం...



**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం, కీసర, మేడ్చల్ జిల్లాలోని సెయింట్ మేరీస్ బేతని కాన్వెంట్ విద్యాలయ హై స్కూల్, కాలేజీల ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ వైద్యులు డా ఎల్ సురేష్ ని ఘనంగా సన్మానించారు. ప్రాణాలను కాపాడుతూ, సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న డా. సురేష్ సేవలను గుర్తించి విద్యాసంస్థ ప్రత్యేక సత్కారం చేయడం ఎంతో గొప్ప విషయం అని, వైద్య వృత్తి పట్ల ఆయనకున్న అంకితభావం, మానవతా దృక్పథం మరియు సేవా తపన యువతకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా ఎల్ సురేష్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. "వైద్యో నారాయణో హరి" అనే మాటకు నిలువెత్తు నిదర్శనం డా ఎల్ సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థనీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాగారంలో సర్ సమావేశం... పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు...




**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన ఆల్ పార్టీ మీటింగ్ లో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆంజనేయులు గౌడ్, తేల శ్రీధర్, కౌకుట్ల అనంతరెడ్డి, ఎండి పాషా, అక్బర్ బాషా, లింగం, నిమ్మల శ్రీనివాస్, రమేష్, కొట్టే దయాకర్, ఓం ప్రకాష్, సంపత్, విగ్నేష్, మల్లేష్, మాజీ వార్డ్ మెంబర్ చిన్నం రాజు సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగారంలో సర్ కార్యక్రమం




**నాగారం, జూలై 2:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ 5 వెస్ట్ గాంధీనగర్ కాలనీ ఆధ్వర్యంలో వి ఆర్ ఆర్ అపార్ట్మెంట్ లో ఎస్ ఐ ఆర్ పైన బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి, ఎక్స్ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, వేధా ప్రకాష్, బి ఎల్ ఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్ ఐ ఆర్ వివరాలు తెలుపాలని అదేవిధంగా వారి భూములు సొంత స్థలాలు ఎక్కడ ఉన్నా కూడా వారు ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటు హక్కు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# వికారాబాద్ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు




**వికారాబాద్ జిల్లా (జర్నలిస్ట్ డైరీ )** హైద రాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాంచందర్ రావును వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు కలిశారు. వికారాబాద్ జిల్లా, ముఖ్యంగా వికారాబాద్ అసెంబ్లీ పరిధిలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కేంద్ర నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం ప్రాధాన్యత కల్పించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.అలాగే రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌ను ప్రశ్నించిన ఘటనలో బీజేపీ సర్పంచ్ బీర్ల రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అక్రమ కేసు నమోదు చేయడంతో పాటు పార్టీ నాయకులు, సర్పంచ్‌లను పోలీసులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై త్వరలోనే డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తానని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు చేసిన పోరాటాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ధారూర్ మండల బీజేపీ అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ జినుగుర్తిలో శ్రీశ్రీశ్రీ సింధూర గణపతిని దర్శించుకున్న డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా (జర్నలిస్ట్ డైరీ)** తాండూర్ మండలం జినుగుర్తి గ్రామం ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆవరణలో వెలసిన శ్రీశ్రీశ్రీ సింధూర గణపతి దేవాలయం లో EGVF పాలిటెక్నిక్ కళాశాల సెక్రటరీ నరేందర్ సార్ గారు, EGVF సంస్థ సెక్రటరీ వేమూరి మూర్తి గారితో కలిసి స్వామివారిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించిన భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ "డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి" గారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, సోషల్ మీడియా కన్వీనర్ రాఘవేందర్, మీడియా కన్వీనర్ మోహన్ రెడ్డి,గౌరక్షణ సభ్యులు ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కీసర ఎస్సీ కాలనీలో సర్ కార్యక్రమం....



**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** కీసర రాజ కాలనిలోని బూత్ నంబర్ 190బోగస్ ఓట్లను తొలగించేందుకు చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి అని కోరుతూ ఇంటింటికీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో (బిఎల్ఓ),పిఎసిఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ కీసర మండల మాజీ అధ్యక్షులు మోర రవికాంత్, శ్రీ సీతారామచంద్ర స్వామి మాజీ ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అనబోయిన జంగయ్య , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి, మాజీ కీసరగుట్ట ట్రస్ట్ బోర్డ్ మెంబర్ శీలం శ్రీనివాస్, బోడుసు రమేష్ యాదవ్, మాజీ కీసర మండలం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మొరుగు రవీందర్, బిఆర్ఎస్ కీసర మండల యువత అధ్యక్షులు తటాకం బానుశర్మ, 11 వార్డు సభ్యులు శీలం లలిత మల్లేష్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చినింగని బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి రఘువెందర్ గౌడ్, యువత అధ్యక్షులు మెట్టు పరమేష్ యాదవ్ రెడ్డి, బోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో నూతన రేషన్ షాపుల ప్రారంభం..

**పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీ మరియు ఈస్ట్ బాలాజీ నగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాపులను మేడ్చల్--మల్కాజ్గిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. కొత్త రేషన్ షాపుల ద్వారా ఆయా కాలనీల ప్రజలకు మరింత సౌకర్యవంతంగా నిత్యావసర సరుకులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్, మాజీ ఘట్కేసర్ మండల్ అధ్యక్షులు కర్రే రాజేష్, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్, రసాల వెంకటేష్ యాదవ్, కిరీన్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, జై రాములు, దేవరకొండ వీరాచారి, పోగుల దిలీప్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంబురంగా రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు

**-సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.19 కోట్లు మంజూరు....**
**-అతి త్వరలోనే రామంతాపూర్ చిన్న చెరువు, నాచారం పటేల్ కుంట చెరువులలోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం**
**-ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



**నాగారం, జూలై 1:-(జర్నలిస్ట్ డైరీ)** రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను బుధవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి రూ.19 కోట్ల నిధులను మంజూరు చేయించారు. స్థానికులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి పనులను పర్యవేక్షించి మాట్లాడారు. ఈ పనులతో ఏ ఒక్కరికీ నష్టం వాటిల్లదన్నారు. బతుకమ్మ కొలను, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ , తదితర ఏర్పాట్లను చేయనున్నట్టుగా చెప్పారు. అతి త్వరలోనే మిగతా రెండు చెరువులలోనూ పనులు చేపడుతామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధికి నిధులను మంజూరు చేయించడంతో పాటు పనులు సైతం ప్రారంభం అయినట్టుగా ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నాచారం లోని పటేల్ కుంట చెరువు, రామంతాపూర్ లోని చిన్న చెరువుల అభివృద్ధి, సుందరికరణ పనులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.వాటిల్లోనూ అభివృద్ధి పనులను ఇదే తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీపై కేంద్రం వెనక్కి తగ్గాలి





**-వి.జి.బి-రాంజీ పథకం రద్దు చేయాలి"**
**-వలిగొండ మండలంలో ఉపాధి కూలీలు, రైతుల ఆందోళన**
**-మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని డిమాండ్**

**వలిగొండ, జూలై 1 (జర్నలిస్ట్ డైరీ)** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించి, గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్పంగి స్వామి, కందడి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వి.జి.బి--రాంజీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు.వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం కేంద్ర కమిటీల పిలుపు మేరకు బుధవారం వలిగొండ మండలంలోని వలిగొండ, కెర్చుపల్లి, పులిగిల్ల గ్రామాల్లో ఉపాధి కూలీలు, రైతులు, కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ పేదల జీవన భద్రతకు మూలస్తంభమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం నిలిపివేయాలని అన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల ఉపాధిని సమర్థవంతంగా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దయ్యాల మల్లేశం, కొండూరు సత్తయ్య, మారబోయిన నరసింహ, కందడి సత్తిరెడ్డి, నర్సిరెడ్డి, దొడ్డి యాదగిరి, సునీత, రాములమ్మ, లక్ష్మి, యాదమ్మ, వసంత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు."గ్రామీణ పేదల కడుపు నింపే ఉపాధి హామీని బలహీనపరచొద్దు... వేతనాలు వెంటనే చెల్లించి, 100 రోజుల పని హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి" -- సిర్పంగి స్వామి, కందడి సత్తిరెడ్డి.

# గోర్ బోలి భాషకు 8వ షెడ్యూల్‌లో స్థానం కల్పించే వరకు కేంద్రంపై యుద్ధమే

**- ఎల్ హెచ్పిఎస్ నాయకులు**



**దోమ మండలం జులై01 (జర్నలిస్ట్ డైరీ)** ఎస్టీ లంబాడీల మాతృభాష అయిన గోర్ బోలిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చే వరకు లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంస్థ నాయకులు స్పష్టం చేశారు. అవసరమైతే త్వరలో న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని జాతీయ అధ్యక్షులు దాస్ రాం నాయక్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ మాట్లాడుతూ జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ నరేందర్ పవార్, కొడంగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, రాష్ట్ర యువనాయకులు బాపల్లి సంతోష్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, జిల్లా అధ్యక్షులు రాథోడ్ సూర్య నాయక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య నాయక్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలు నాయక్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వాసు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో లంబాడి హక్కుల పోరాట సమితి నగరాబేరి 30వ ఆవిర్భావ సభ సందర్భంగా సంస్థ జెండాను జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు, రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఘట్య నాయక్, హరి నాయక్, మెదక్ జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, మహబూబ్ నగర్ అధ్యక్షులు శివ నాయక్, జనగామ జిల్లా అధ్యక్షులు వీరేష్ నాయక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నవ రాంనాయక్, దేశ్య నాయక్, ఎంపీటీసీ రాందాస్ నాయక్, సీనియర్ నాయకులు పులి రాములు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధానకార్యదర్శి కుషాల్ నాయక్, జనగామ జిల్లా ప్రధానకార్యదర్శి బాలు జాదవ్, సీనియర్ నాయకులు రాములు నాయక్, కొడంగల్ నియోజకవర్గంలోని సర్పంచ్, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం కొడంగల్ కేవీఎస్ మురారి ఫంక్షన్ హల్ లో జరిగిన సభలో ఎల్ హెచ్పిఎస్ నాయకులు మాట్లాడుతూ పలు కీలక డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీల రిజర్వేషను, కేంద్ర ప్రభుత్వం 7.5% రిజర్వేషన్ను జనాభా ధమాషా ప్రకారంగా 14%శాతం పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఎస్టీల 10% రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో వెంటనే చేర్చాలి. దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఒకే ఎస్టీ జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చాలని తాండాల గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయాలి. తండా డెవలప్మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలనీ ఎస్టీలు సాగు చేస్తున్న లావాణి, సీలింగ్, పోడు భూములకు శాశ్వతంగా పూర్తి హక్కులతో అసెంబ్లీలో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలి. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100%శాతం రిజర్వేషన్ ST లకు రాష్ట్రములో అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్పిఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రేకప్ రూమర్లకు కృతి సనన్ ఫుల్ స్టాప్ ..

## బాయ్‌ఫ్రెండ్ కబీర్‌తో ఫోటో వైరల్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా లండన్‌కు చెందిన వ్యాపారవేత్త కబీర్ బాహియాతో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కృతి చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఆ రూమర్లకు చెక్ పెట్టిందా అనే చర్చ మొదలైంది. కృతి సనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ ఏడాది తొలి ఆరు నెలలకు సంబంధించిన ప్రత్యేక క్షణాలను 'హాఫ్ ఇయర్లీ డంప్' పేరుతో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఆమె కుటుంబ సభ్యులు, సోదరి నుపూర్ సనన్, పెంపుడు కుక్క, పర్యటనలకు సంబంధించిన చిత్రాలతో పాటు నటి రష్మిక మందన్నతో దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి.అయితే అందరి దృష్టిని ఆకర్షించింది కబీర్ బాహియాతో ఉన్న ఒక ఫోటో. లైవ్ మ్యూజిక్ ఈవెంట్‌లో ఇద్దరూ కలిసి కనిపించిన ఈ ఫోటోలో ఒకరినొకరు ఆప్యాయంగా హత్తుకున్నట్లు కనిపించారు. దీంతో వీరిద్దరూ ఇప్పటికీ రిలేషన్‌లోనే ఉన్నారనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కబీర్ బాహియా మరో యువతితో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, కృతి--కబీర్ మధ్య బ్రేకప్ జరిగిందనే ప్రచారం మొదలైంది. అయితే జాతీయ మీడియా కథనాల ప్రకారం, కబీర్‌కు సన్నిహిత వర్గాలు ఆ ప్రచారాన్ని ఖండించాయి. వైరల్ అయిన ఫోటోలో కనిపించిన యువతి కబీర్ కుటుంబానికి అత్యంత సన్నిహితురాలని, ఆమెను ఆయన సోదరిలా భావిస్తారని పేర్కొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని వారు తెలిపినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కృతి సనన్ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. తన సంబంధాలపై బహిరంగంగా చర్చించేందుకు ఆసక్తి లేదని, వివాహం జరిగే వరకు వ్యక్తిగత విషయాలను ప్రైవేట్‌గా ఉంచాలనుకుంటున్నానని ఆమె చెప్పారు. నాకు పెళ్లి అయిన తర్వాతే నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతాను. కొన్ని విషయాలు నాకు, నా కుటుంబానికే పరిమితం కావాలి అని ఆమె పేర్కొన్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, కృతి సనన్ ప్రస్తుతం షాహిద్ కపూర్, రష్మిక మందన్నతో కలిసి నటించిన 'కాక్‌టెయిల్ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. అయితే కృతి--కబీర్ రిలేషన్‌పై ఇప్పటికీ ఇద్దరి నుంచి అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. దీంతో సోషల్ మీడియాలో వినిపిస్తున్న అనేక వార్తలు, విశ్లేషణలు కేవలం ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది. అయితే కృతి షేర్ చేసిన తాజా ఫోటో మాత్రం బ్రేకప్ రూమర్లపై మరోసారి చర్చకు దారితీసింది.



మరింత అందంగా 'దృశ్యం' పాప..

# తేజ సజ్జ 'జాంబీ రెడ్డి 2'లో బాలీవుడ్ బ్యూటీ?

## టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైందా!




హనుమాన్,మిరాయ్ వంటి వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తేజ సజ్జ ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఆయన కెరీర్‌లో తొలి రోజులలో మంచి విజయం సాధించిన 'జాంబీ రెడ్డి' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కనున్న జాంబీ రెడ్డి 2 పై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ యువ నటి షనాయా కపూర్ ఈ చిత్రంలో కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'జాంబీ రెడ్డి 2'లో హీరోయిన్ పాత్ర కోసం షనాయా కపూర్‌తో చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాతోనే ఆమె తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర నిర్మాణ సంస్థ లేదా షనాయా కపూర్ టీమ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం ఈ వార్తను కేవలం ప్రచారంగానే పరిగణిస్తున్నారు. 2021లో విడుదలైన 'జాంబీ రెడ్డి' తెలుగు ప్రేక్షకులకు విభిన్నమైన జాంబీ థ్రిల్లర్ అనుభూతిని అందించింది. హారర్, కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో సీక్వెల్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పుడు రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందించేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. 'జాంబీ రెడ్డి'కి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు కథను అందించినట్లు సమాచారం. అయితే రెండో భాగానికి ఆయన దర్శకత్వం వహించరని, మరో దర్శకుడు ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం హీరోయిన్ ఎంపికతో పాటు చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# రోజూ వేధించేవారు, చివరకు రాయి విసిరా ..

## -స్కూల్ రోజుల్లో ఎదురైన చేదు అనుభవం ఇది...!

యువ నటి కయాదు లోహర్ తన స్కూల్ రోజుల్లో ఎదుర్కొన్న వేధింపుల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పదో తరగతి చదువుతున్న సమయంలో కొందరు యువకుల వేధింపులను ఎదుర్కొన్నానని, ఒక దశలో సహనం కోల్పోయి ఆవేశంతో రాయి విసిరిన సంఘటన ఇప్పటికీ గుర్తుందని ఆమె చెప్పుకొచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కయాదు లోహర్, తాను పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఇంటికి సమీపంలో ఉన్న ట్యూషన్‌కు వెళ్లేదాన్నని తెలిపారు. ఆ మార్గంలో ప్రతిరోజూ కొందరు అబ్బాయిలు తనను వేధించేవారని చెప్పారు. మొదటి రోజు వాటిని పట్టించుకోలేదని, రెండో రోజు కూడా మౌనంగానే వెళ్లిపోయానని, కానీ మూడో రోజు మాత్రం పరిస్థితి భరించలేకపోయానని ఆమె గుర్తు చేసుకున్నారు.ఆ రోజు తీవ్ర కోపంతో రోడ్డుపై ఉన్న రాయిని తీసుకుని వారివైపు విసిరినట్లు కయాదు తెలిపారు. ఆ రాయి ఒక యువకుడి తలకు తగలడంతో అతడికి గాయమై రక్తస్రావం జరిగిందని చెప్పారు. ఆ ఘటన తర్వాత తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని, తర్వాత ఏమైందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఆ సమయంలో కోపం, భయం, నిస్సహాయత కలిసి తనను అలా స్పందించేలా చేశాయని వివరించారు. ఆ సంఘటనను ఇప్పుడు తిరిగి గుర్తు చేసుకుంటే, ఎవరినైనా గాయపరచడం సరైన పద్ధతి కాదని కయాదు అంగీకరించారు. హింస ఎప్పుడూ పరిష్కారం కాదని చెప్పిన ఆమె, అయితే అప్పటి పరిస్థితుల్లో తనకు ఎదురైన వేధింపులు, మానసిక ఒత్తిడి కారణంగానే అలా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. సాధారణంగా తాను ప్రశాంత స్వభావం కలిగిన వ్యక్తినని, కానీ ఎవరైనా తప్పు చేస్తే దానిని మౌనంగా భరించడం కూడా సరికాదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కయాదు లోహర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు విద్యాసంస్థలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎదుర్కొనే వేధింపుల సమస్యపై మరోసారి చర్చ మొదలైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు మరింత బలోపేతం కావాలని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కయాదు లోహర్ పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన 'ఇధయమ్ మురళి' జూలై 10న విడుదల కానుండగా, 'ఇమ్మోర్టల్' జూలై 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే 'ఐ యామ్ గేమ్', 'ఖలీఫా', 'ది ప్యారడైజ్' వంటి చిత్రాలతో పాటు హీరో సూర్య నటిస్తున్న మరో చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. న్నారు.

# తుదిదశలో 'ఫౌజీ'



అగ్ర హీరో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ'పై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రేమ, దేశభక్తి, యుద్ధం మిళితమైన కథతో దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో తిరుగుబాటుదారుడిగా మారిన బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారు. ఇమాన్వి కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం నిర్మాణం తుది దశకు చేరుకున్నది.ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనున్నారు. ఆ గ్లింప్స్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించనున్నారు. యుద్ధ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ మూవీలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందని, మునుపెన్నడూ చూడనటువంటి విభిన్నమైన పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని ఇన్‌సైడ్ టాక్. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

# 'ఓజీ–2'లో నాయికగా?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే కొంతకాలం పాటు తెలుగు సినిమాకు దూరంగా ఉంది. బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ సొగసరి అక్కడ వరుస ఫ్లాపులు పలకరించడంతో మళ్లీ దక్షిణాది బాట పట్టింది. ప్రస్తుతం తెలుగు, తమిళంలో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తొలిసారి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... బ్లాక్‌బస్టర్ మూవీ 'ఓజీ'కి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దర్శకుడు సుజీత్ ప్రస్తుతం సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు.మరోవైపు కథానాయిక అన్వేషణలో కూడా చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. ఈ రేసులో పూజాహెగ్డే పేరు ప్రముఖంగా వినిపిస్తున్నదని, ఆమెనే ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం పూజాహెగ్డే తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465